జగనన్నతోనే జనరంజక పాలన

- ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి
- మండల, గ్రామ జేసీఎస్ కన్వీనర్లకు బీమాతో భరోసా
- రావూరి గార్డెన్స్‌లో జేసీఎస్ కన్వీనర్లతో సమావేశం
- 98 శాతం హామీలు అమలు చేశాం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి

కల్లూరు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి క్షేత్రస్థాయిలో ప్రజలందరూ మెచ్చేలా శ్రేష్ఠమైన పాలన అందిస్తున్నారని వైఎస్సార్‌సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు, పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి అన్నారు. గురువారం కర్నూలు నగరంలోని రావూరి గార్డెన్స్ ఫంక్షన్ హాలలో నియోజకవర్గంలోని జేసీఎస్ మండల, గ్రామ/వార్డు సచివాలయాల ఇన్‌చార్జ్ కన్వీనర్లకు ఉచిత బీమా నమోదు కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి నియోజవర్గ పరిధిలోని నాలుగు మండలాలు, కల్లూరు అర్బన్ జేసీఎస్ ఇన్‌చార్జ్‌లు, సచివాలయాల కన్వీనర్లు, పలువురు ప్రజాప్రతినిధులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కాటసాని మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి మండల జేసీఎస్ ఇన్‌చార్జ్‌లు, సచివాలయాల కన్వీనర్లకు పార్టీ తరపున బీమా సౌకర్యం కల్పించారన్నారు. పార్టీ కార్యకర్తలకు, నాయకులకు వైఎస్సార్‌సీపీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందన్నారు. రానున్న ఎన్నికల్లో మరోసారి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి ముఖ్యమంత్రిగా పట్టం కట్టాలని పిలుపునిచ్చారు. అందుకు గ్రామ స్థాయి నుంచి నాయకులు సమన్వయంగా పని చేయాలన్నారు. ఈ నాలుగేళ్లలో ప్రభుత్వం చేసిన మంచిని సచివాలయాల కన్వీనర్లు ఇంటింటికీ వెళ్లి వివరించాలని సూచించారు.

98 శాతం హామీల అమలు

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం మేనిఫెస్టోలో ఇచ్చిన హామీల్లో 98 శాతం అమలు చేసిందని, సచివాలయ, వలంటీర్ వ్యవస్థలను ఏర్పాటు చేసి అర్హులైన వారందరికీ నేరుగా ఇంటి వద్దకే పథకాలు అందిస్తోందని ఎమ్మెల్యే కాటసాని అన్నారు. గత టీడీపీ పాలనకు, ప్రస్తుత వైఎస్సార్‌సీపీ నాలుగేళ్ల పాలనలో తేడాను రాష్ట్రంలోని ప్రజలందరూ గమనిస్తున్నారన్నారు. టీడీపీ పాలనలో అర్హులై ఉండి పథకాలు పొందాలంటే జన్మభూమి కమిటీ సిఫారసులతో పాటు నాయకుల అండదండలు కావాల్సివచ్చేదన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అర్హతే ప్రమాణికంగా పార్టీలు, రాజకీయాలకు అతీతంగా ప్రతిఒక్కరికీ ప్రభుత్వ పథకాలు అందిస్తున్నామన్నారు.

50 శాతం పదవులు మహిళలకే..

రాష్ట్రంలో సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, జెడ్పీటీసీలు, కార్పొరేటర్లు, మేయర్లు, జెడ్పీటీసీ చైర్మన్లు, నామినేటెడ్ పదవుల్లో మహిళలకు 50 శాతం కేటాయించిన ఘనత వైఎస్సార్‌సీపీదేనని ఎమ్మెల్యే కాటసాని స్పష్టం చేశారు. రాష్ట్రంలో అందిస్తున్న అమ్మ ఒడి, వైఎస్సార్ ఆసరా, సున్నా వడ్డీ మొదలగు సంక్షేమ పథకాలలో 75 శాతం మహిళల పేరుపై అమలు చేస్తున్నామని వివరించారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ రేణుక, కర్నూలు మార్కెట్ యార్డు కమిటీ చైర్మన్ మీదివేముల ప్రభాకర్‌రెడ్డి, కేడీసీసీ బ్యాంక్ డైరెక్టర్ కేవీ రమణారెడ్డి, కల్లూరు అర్బన్, నాలుగు మండలాల జేసీఎస్ ఇన్‌చార్జ్ కన్వీనర్లు హనుమంతురెడ్డి, గోవర్ధన్‌రెడ్డి, కేశవరెడ్డి, లోటర్‌బాష, సుమంత్‌రెడ్డి, నాగేశ్వర్‌రెడ్డి, జెడ్పీటీసీలు, వివిధ సంఘాల డైరెక్టర్లు, కార్పొరేటర్లు, నియోజకవర్గంలోని నాయకులు పాల్గొన్నారు.

ఉద్యోగులు సమయపాలన పాటించాలి



శిక్షణ పూర్తి చేసుకున్న ఉద్యోగులకు సర్టిఫికెట్లు అందజేస్తున్న మేనేజర్ చిన్నరాముడు

కర్నూలు(టౌన్): కచ్చితంగా సమయపాలన పాటించడం, విధి నిర్వహణలో క్రమశిక్షణ అలవర్చుకుంటే ఉద్యోగ విధుల్లో రాణిస్తారని నగరపాలక మేనేజర్ చిన్నరాముడు అన్నారు. గురువారం స్థానిక సీతారామనగర్‌లోని టెలికమ్యూనికేషన్ కన్సల్టెంట్ ఇండియా సంస్థలో స్కిల్ అప్‌గ్రేడేషన్ శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. 24 నుంచి 46వ వార్డు పరిధిలోని సచివాలయాల కార్యదర్శులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. శిక్షణ కార్యక్రమంలో భాగంగా సర్వీస్ రూల్స్, కండక్ట్ రూల్స్, డిజిటల్ అడ్మినిస్ట్రేషన్ అంశాలపై అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా మేనేజర్ మాట్లాడుతూ.. ప్రజలు కార్యాలయాల చుట్టూ తిరగకుండా స్థానికంగానే సేవలందించే విధంగా ప్రభుత్వం గ్రామ సచివాలయ వ్యవస్థను ఏర్పాటు చేసిందన్నారు. సచివాలయాల్లో పనిచేసే ఉద్యోగులు శిక్షణలోని అంశాల్లో పట్టు పెంచుకొని వృత్తిలో రాణించాలన్నారు. రెవెన్యూ ఆధికారి జునీద్, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

కలెక్టర్‌ను కలిసిన కన్జ్యూమర్ ఫోరం బృందం



కలెక్టర్ జి.సృజనను కలిసిన కన్జ్యూమర్ కమిషన్ ప్రెసిడెంట్ కె.కిషోర్‌కుమార్, సభ్యులు

కర్నూలు (లీగల్): జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.సృజనను జిల్లా వినియోగదారుల పరిష్కార కమిషన్ మర్యాదపూర్వకంగా కలిసి మొక్కను బహుకరించారు. కలెక్టర్‌ను గురువారం కలిసిన వారిలో కమిషన్ అధ్యక్షులు కె.కిషోర్‌కుమార్, సభ్యులు నారాయణరెడ్డి, నసీమా కౌసర్ ఉన్నారు. జిల్లా వినియోగదారుల ఫిర్యాదులను సత్వరం పరిష్కరించేందుకు కృషి చేయాలని సూచించారు.

నేడు మహా గౌరీ అమ్మవారికి ప్రత్యేక పూజలు

కర్నూలు కల్చరల్: శ్రావణ మాసాన్ని పురస్కరించుకొని స్థానిక సూర్యనారాయణ స్వామి ఆలయంలో శుక్రవారం మహా గౌరీ అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు ఆలయ మేనేజింగ్ ట్రస్టీ శివరామకృష్ణ తెలిపారు. శ్రీ లక్ష్మీ సహస్రనామార్చన, లఘున్యాస పూర్వక రుద్రాభిషేకం, తదితర పూజలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. భక్తులు అందరూ పాల్గొనవచ్చని విజ్ఞప్తి చేశారు.

ప్రైమరీ స్కూల్ హెచ్‌ఎం సస్పెన్షన్

కర్నూలు(సిటీ): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన మానబడి నాడు–నేడు కార్యక్రమానికి సంబంధించిన నిధుల దుర్వినియోగానికి పాల్పడినందుకు నగరంలోని ఓ ప్రైమరీ స్కూల్ హెచ్‌ఎంపై సస్పెన్షన్ వేటు పడింది. బంగారుపేటలోని మున్సిపల్ ప్రైమరీ స్కూల్ ప్రధానోపాధ్యాయులుగా పనిచేస్తున్న ఎస్.బుడ్డన్న నాడు–నేడు పనులకు సంబంధించి సెల్ఫ్ చెక్ ద్వారా రూ.4.60 లక్షలు డ్రా చేశారు. ఇందులో రూ.2,41,200 మాత్రమే ఖర్చు చేశారు. మిగతా మొత్తానికి లెక్కలు చూపించకుండానే విధుల నుంచి తప్పుకున్నారు. ఈ ఏడాది జూన్ 10వ తేదీ నుంచి ఆయన విధుల నుంచి తప్పుకున్నట్లు తేలడంతో సస్పెండ్ చేసినట్లు డీఈఓ రంగారెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు.

సమష్టి కృషితోనే శకటానికి బహుమతి

కర్నూలు(అగ్రికల్చర్): స్వాతంత్య్ర దినోత్సవ కార్యక్రమం సందర్భంగా అద్భుతంగా శకటం తయారు చేయడం, అందరినీ ఆకట్టుకునే విధంగా స్టాల్ ఏర్పాటు చేసిన వ్యవసాయ యంత్రాంగాన్ని జిల్లా వ్యవసాయ అధికారి పీఎల్ వరలక్ష్మి అభినందించారు. స్థానిక పోలీస్ పెరేడ్ గ్రౌండ్‌లో జరిగిన స్వాతంత్య్ర దిన వేడుకలలో వ్యవసాయ శాఖ శకటానికి, స్టాల్‌కు మొదటి బహుమతులు లభించిన నేపథ్యంలో గురువారం తన కార్యాలయంలో అభినందన కార్యక్రమం నిర్వహించారు. ఆకట్టుకునే విధంగా శకటం, స్టాల్‌ను తీర్చిదిద్దిన ప్రతి ఒక్కరిని అభినందించారు. సమిష్టిగా పనిచేయడం వల్ల స్వాతంత్య్ర దినోత్సవ వేడుకలు విజయవంతం అయ్యాయని పేర్కొన్నారు. కర్నూలు ఏడీఏ సాలురెడ్డి, అగ్రానమీ ఏడీఏ బాలవర్ధిరాజు, ఏఓలు దస్తగిరిరెడ్డి, విశ్వనాథ్, కార్యాలయ పరిపాలన అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

నీటిని పొదుపుగా వాడుకోండి

కర్నూలు (టౌన్): నగర ప్రజలు మంచి నీటిని పొదుపుగా వాడుకోవాలని నగరపాలక ఇన్‌చార్జ్ కమిషనర్ రామలింగేశ్వర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. సుంకేసుల బ్యారేజ్ వద్ద కేసీ కెనాల్ గేటుకు జల వనరుల శాఖ ఆధ్వర్యంలో మరమ్మతు పనులు చేపడుతున్నట్లు తెలిపారు. మరమ్మతుల కారణంగా కేసీ కెనాల్‌కు నీటిని సరఫరా చేయడం సాధ్యం కాదన్నారు. మరమ్మతు పనులకు 5 నుంచి 7 రోజులు పడుతుందని తెలిపారు. ప్రస్తుతం నగరానికి సమ్మర్ స్టోరేజీ ట్యాంకు నుంచి నీటిని సరఫరా చేస్తున్నట్లు పేర్కొన్నారు. సమ్మర్ స్టోరేజీ ట్యాంకులో నీటి మట్టం ఎండ బ్ల్యూఎల్ కన్నా తక్కువగా పడిపోవడం వల్ల పలు కాలనీలకు నీటి సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని వివరించారు. నగర ప్రజలు నీటిని పొదుపుగా వాడుకుంటూ సహకరించాలని విన్నవించారు.

రాజగోపుర నిర్మాణానికి విరాళాలు



దాతకు బాండ్ అందజేస్తున్న దృశ్యం

కౌతాళం: ఉరుకంద ఈరన్న స్వామి దేవాలయంలో చేపడుతున్న రాజగోపుర నిర్మాణానికి గురువారం పలువురు భక్తులు విరాళాలు అందజేశారు. ఆలయ అసిస్టెంట్ కమిషనర్ వాణి, ఆలయ ట్రస్టుబోర్డు చైర్మన్ నాగరాజ్‌గౌడ్ మాట్లాడుతూ..కర్ణాటకలోని రాయచూర్ పట్టణానికి చెందిన కుంటనహల్ విజయ్‌కుమార్, కుటుంబ సభ్యులు రూ.1,00,100, కర్నూలుకు చెందిన ఈ.రామచంద్రగౌడ్ కుటుంబ సభ్యులు రూ.1,01,121, తెలంగాణ రాష్ట్రం వనపర్తికి చెందిన డాక్టర్ కె. నరేష్‌కుమార్, కుటుంబ సభ్యులు రూ. 1,00,016 అందజేశారని తెలిపారు. వారికి స్వామి వారి తీర్థప్రసాదాలు, శేషవస్త్రం, బాండ్ అందజేసినట్లు చెప్పారు.

ప్రతి ఇంటా సంక్షేమ వెలుగులు



లబ్ధిదారురాలికి సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే కాటసాని, మేయర్ బీవై రామయ్య

కల్లూరు: రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అందిస్తున్న పథకాలతో ప్రతి ఇంట్లో సంక్షేమ వెలుగులు నిండాయని వైఎస్సార్‌సీపీ నంద్యాల, కర్నూలు జిల్లాల అధ్యక్షులు పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి, మేయర్ బీవై రామయ్య అన్నారు. గురువారం కల్లూరు అర్బన్ 19వ వార్డు నాగిరెడ్డి రెవెన్యూ కాలనీ, సోమిశెట్టి నగర్‌లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం నుంచి సంక్షేమ పథకాల ద్వారా అందించిన లబ్ధిని వివరిస్తూ బుక్‌లెట్లను పంపిణీ చేశారు. కాలనీలో ఎమైనా సమస్యలు ఉంటే తమకు తెలియజేయాలన్నారు. కాలనీ వాసులు డ్రైనేజీ కాలువలు, సీసీ రోడ్లు, కల్వర్టులు నిర్మించాలని విన్నవించగా ఆయా సమస్యలను సకాలంలో పరిష్కరించాలని మున్సిపల్ అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కాటసాని, మేయర్ రామయ్య మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అవినీతి రహితంగా జనరంజక పాలన అందిస్తున్నారన్నారు. పథకాల అమల్లో మధ్యవర్తుల ప్రమేయం లేకుండా నేరుగా అర్హులైన వారి బ్యాంకు ఖాతాలోనే నగదు జమ చేస్తున్నారన్నారు. పథకాల ద్వారా ప్రజలు జీవనోపాధులను మెరుపర్చుకోవాలని సూచించారు. వీరశైవ లింగాయత్ కార్పొరేషన్ డైరెక్టర్ గోపాల్‌రెడ్డి, జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ మహేశ్వర్ రెడ్డి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సంయుక్త ప్రధాన కార్యదర్శి సీహెచ్ మద్దయ్య, కార్పొరేటర్లు లక్ష్మిరెడ్డి, లక్ష్మికాంతరెడ్డి, సుదర్శన్‌రెడ్డి, స్థానిక నాయకులు, మున్సిపల్ అధికారులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

సాంస్కృతిక సంపదను పరిరక్షించుకోవాలి



గ్లింపెన్స్ ఆఫ్ కర్నూలు గ్రంథం ఆవిష్కరణ సభలో ఇంతియాజ్, గోళ్ల నారాయణరావు, శివనాగిరెడ్డి తదితరులు

విజయవాడ కల్చరల్: సాంస్కృతిక, చారిత్రక వారసత్వ సంపదను పరిరక్షించుకోవాలని సీసీఎల్‌ఏ అదనపు ప్రధాన కమిషనర్ ఏఎండీ ఇంతియాజ్ అన్నారు. గురువారం డాక్టర్ కేఎం ఇస్మాయిల్ హుస్సేన్ స్ఫూర్తి ప్రసంగం, కర్నూలు జిల్లా 165వ ఆవిర్భావ వేడుకలు, గింప్సెస్ ఆఫ్ కర్నూలు పుస్తక ఆవిష్కరణ, కర్నూలు జిల్లాకు చెందిన వివిధ రంగాల వారికి డాక్టర్ కేఎం ఇస్మాయిల్ హుస్సేన్ స్ఫూర్తి పురస్కారాల కార్యక్రమం నిర్వహించారు. కామ్రేడ్ జీఆర్‌కే పోలవరపు సాంస్కృతిక సమితి, ఫోరం ఫర్ ఆర్టిస్ట్, ఫొటోగ్రఫీ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో విజయవాడ బందరు రోడ్డులోని బాలోత్సవ భవన్‌లోని కేఎం ఇస్మాయిల్ ప్రాంగణంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఇంతియాజ్ పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ.. దేశ భవిష్యత్‌ను నిర్ణయించేది వారసత్వ సంపదేనని గుర్తు చేశారు. గాడిచర్ల ఫౌండేషన్ నిర్వాహకుడు కె.చంద్రశేఖర్ కల్కుర, మానవ శక్తి పరిశోధనా కేంద్రానికి చెందిన ఎస్.మన్సూర్ హుస్సేన్, ఎస్.మనుస్సూర్ రచించిన గ్రంథం గ్లింపెన్స్ ఆఫ్ కర్నూల్ (కర్నూల్ జిల్లా సంక్షిప్త చరిత్ర) గ్రంథాన్ని ఎ.మహ్మద్ ఇంతియాజ్ ఆవిష్కరించారు. ఇదే జిల్లాకు చెందిన సాంస్కృతిక వైభవాన్ని చాటుతూ ప్రదర్శించిన ఫొటో ప్రదర్శన ఆకట్టుకుంది. కర్నూలు జిల్లా 165 ఆవిర్భావ వేడుకల సందర్భంగా వివిధ రంగాలకు చెందిన ప్రముఖులకు డాక్టర్ కేఎం ఇస్మాయిల్ హుస్సేన్ అత్యుత్తమ గౌరవ పురస్కారాలను ప్రదానం చేశారు. కామ్రేడ్ జీఆర్‌కే పోలవరపు సాంస్కృతిక సమితి వ్యవస్థాపకుడు గోళ్ల నారాయణరావు, డాక్టర్ ఈమని శివనాగిరెడ్డి పాల్గొన్నారు.

కలెక్టర్, జేసీలను కలిసిన ఏపీఆర్‌ఎస్‌ఏ కార్యవర్గం



కలెక్టర్ డాక్టర్ జి.సృజనను కలిసి కృతజ్ఞతలు తెలుపుతున్న ఏపీఆర్‌ఎస్‌ఏ కార్యవర్గ సభ్యులు

కర్నూలు(సెంట్రల్): ఇటీవల ఎంపికైన ఆంధ్రప్రదేశ్ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ (ఏపీఆర్‌ఎస్‌ఏ) జిల్లా నూతన కార్యవర్గ సభ్యులు అధ్యక్షుడు వి.గిరికుమార్ రెడ్డి నేతృత్వంలో కలెక్టర్ డాక్టర్ జి.సృజన, జేసీ నారపురెడ్డి మౌర్యను మర్యాదపూర్వకంగా కలిశారు. రెవెన్యూ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కోరగా సానుకూలంగా స్పందించినట్లు వారు తెలిపారు. ఉద్యోగుల స్పందనను ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు నిర్వహిస్తున్నట్లు చెప్పారని, అందుకోసం ఏపీఆర్‌ఎస్‌ఏ తరఫున వారికి కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు వి.గిరికుమార్‌రెడ్డి తెలిపారు.

వేధింపులపై చర్యలు తీసుకోవాలి



డీఎంహెచ్‌ఓ డాక్టర్ రామగిడ్డయ్యకు వినతి పత్రం సమర్పిస్తున్న ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు

కర్నూలు(హాస్పిటల్): కల్లూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో నర్సింగ్ విద్యార్థినిలను వేధిస్తున్న వైద్యుడిపై చర్యలు తీసుకోవాలని డీఎంహెచ్‌ఓ డాక్టర్ బి.రామగిడ్డయ్యకు ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు గురువారం వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. నగరంలోని ఆదర్శ నర్సింగ్ కాలేజీలో ఏఎన్‌ఎం, జీఎన్‌ఎం కోర్సులలో చేరిన మొదటి సంవత్సరం విద్యార్థినులు మూడు నెలలు కల్లూరులోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వెళ్లి శిక్షణ తీసుకుంటున్నారన్నారు. రెండు నెలలుగా ఆ విద్యార్థినులను అక్కడ పనిచేసే వైద్యుడు ఇబ్బంది పెడుతుండటంతో వారు మానసిక వేదనకు గురై పీహెచ్‌సీకి వెళ్లడం లేదని చెప్పారు. ఇలాంటి వైద్యుడిపై పూర్తిస్థాయి విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని కోరారు. వినతి పత్రం ఇచ్చిన వారిలో జిల్లా అధ్యక్షుడు రంగప్ప, కార్యదర్శి అబ్దుల్లా, సభ్యులు ఉదయ్, అమర్, నరసింహ ఉన్నారు.

లైంగిక దాడి కేసులో నిందితుల అరెస్ట్

తుగ్గలి : మండల పరిధిలోని ఎద్దులదొడ్డిలో మహిళపై జరిపిన లైంగిక దాడి కేసుకు సంబంధించి నిందితులను పోలీసులు అరెస్ట్ చేశారు. గురువారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో సీసీఎస్ డీఎస్పీ శ్రీనివాసులు సమక్షంలో ఎస్‌ఐ మల్లికార్జున అరెస్ట్ వివరాలను తెలిపారు. ఎద్దులదొడ్డిలో పది రోజుల క్రితం ఓ మహిళపై అదే గ్రామానికి చెందిన బోయ పందికోన రామానాయుడు, ఈడిగ ఉపేంద్రగౌడ్ బలవంతంగా లైంగిక దాడికి పాల్పడడమే కాకుండా ఆ దృశ్యాలను సెల్‌ఫోన్‌లో చిత్రీకరించి వాట్సాప్‌లో పోస్టు చేశారన్నారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపినట్లు ఎస్‌ఐ తెలిపారు.







వేదశ్రీ చిత్రించిన చిత్రఖండాలు

చిత్రం.. అబ్బురం

- పెయింటింగ్‌లో అద్భుత ప్రతిభ
- బహుముఖ ప్రతిభా పాటవాలు ప్రదర్శిస్తున్న వేదశ్రీ



కోడిగుడ్డుపై అద్భుత కళా రూపం

కర్నూలు కల్చరల్: ఒక్కసారి చూస్తే చాలు.. అచ్చం అలాగే బొమ్మ దిగాల్సిందే.. ఇష్టాన్నే హాబీగా మార్చుకొని తీరిక సమయాల్లో బొమ్మలు గీయడం, పెయింటింగ్ వేయడం మొదలు పెట్టిన ఆ విద్యార్థిని అద్భుతంగా చిత్రాలు గీస్తూ అందరిచేత శభాష్ అనిపించుకుంటోంది. రాష్ట్ర, జాతీయ స్థాయి చిత్రలేఖన పోటీల్లో తన ప్రతిభా పాటవాలతో రాణిస్తూ ప్రశంసలు అందుకుంటోంది. నందికొట్కూరుకు చెందిన స్వప్న, రామకృష్ణ దంపతుల కుమార్తె వేదశ్రీ ఆ పట్టణంలో సెయింట్ మేరీస్ పాఠశాలలో పదో తరగతి చదువుతోంది. ఐదో తరగతి నుంచే చిత్రలేఖనంపై ఇష్టంతో చిత్రాలు గీసేది. తల్లిదండ్రుల ప్రోత్సాహంతో రెండేళ్లు శిక్షణ తీసుకొని నైపుణ్యం పెంచుకుంది. సామాజిక సమస్యలపై ఆకట్టుకునేలా చిత్రాలు గీసి ఆలోచింపజేస్తోంది. చదువుతో పాటు తనకు ఇష్టమైన చిత్రలేఖనంలో రాణిస్తూ అందరిచేత అభినందనలు అందుకుంటోంది. తల్లిదండ్రుల ప్రోత్సాహం, ఉపాధ్యాయుల మార్గదర్శనంతో వేద శ్రీ వేసిన చిత్రాలు ఆకట్టుకుంటున్నాయి. పెన్సిల్ ఆర్ట్, కోడిగుడ్డుపై చిత్రాలు గీస్తూ వెరీ గుడ్ అనిపించుకుంది. దీంతో పాటు ప్రభుత్వం నిర్వహించే టెక్నికల్ పరీక్షల్లో చిత్రలేఖనంలో తన సత్తా చాటింది.

చిత్రలేఖనంలో వేదశ్రీ ప్రతిభ

- 2022లో కోనసీమ చిత్ర కళ పరిషత్ వారు నిర్వహించిన ఇంటర్నేషనల్ చిల్డ్రన్స్ ఆర్ట్ కాంపిటీషన్స్‌లో ప్రథమ స్థానంలో నిలిచి గోల్డ్ మెడల్ అందుకున్నారు.
- 2023 ఏప్రిల్‌లో నందికొట్కూరు కళా వేదిక వారు నిర్వహించిన పోటీల్లో ద్వితీయ స్థానంలో నిలిచి సిల్వర్ మెడల్ సాధించారు.
- విద్యా శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లా స్థాయి చిత్రలేఖనం పోటీల్లో ప్రథమ స్థానంలో నిలిచి బహుమతి అందుకున్నారు.
- 2023లో శ్రీ దర్శిణి కలైకోడం వారు నిర్వహించిన నేషనల్ యూత్‌ఫెస్టివల్ 19వ ఆలిండియా ఆర్టిస్ట్ కాంటెస్ట్ అండ్ ఎగ్జిబిషన్‌లో పాల్గొని జాతీయస్థాయిలో ప్రతిభ కనబరిచి చెన్నైలో అతిథులచే బహుమతి అందుకున్నారు.

డ్రాయింగ్‌తో ఏకాగ్రత పెరుగుతుంది



నాకు ఐదో తరగతి నుంచి బొమ్మలు గీయడం అలవాటు అయ్యింది. విభిన్న చిత్రాలు గీయడం ద్వారా ఏకాగ్రత పెరుగుతుంది. కొత్త కొత్త ఆలోచనలు వస్తాయి. అమ్మానాన్నల ప్రోత్సాహంతో చిత్రలేఖనంపై మరింత ఇష్టం కలిగింది. దీంతో సామాజిక సమస్యలపై అవగాహన కల్పించేలా చిత్రాలు గీయడం మొదలు పెట్టాను. ఉపాధ్యాయుల సలహాలు, సూచనలతో మెలకువలు తెలుసుకొని మరింత కొత్తదనంతో చిత్రాలు గీస్తున్నాను.

– వేదశ్రీ


సూపర్ మార్కెట్ల తనిఖీ



సూపర్ మార్కెట్‌లో తనిఖీ చేస్తున్న ఇన్‌స్పెక్టర్ పీవీఎం పరమేశ్వరకుమార్

కర్నూలు (న్యూసిటీ): కర్నూలులోని గాంధీనగర్, ఆటోనగర్, సీ క్యాంప్, నంద్యాల చెక్‌పోస్ట్ ప్రాంతాల్లో సూపర్ మార్కెట్లు, కార్ డెకార్స్ షాపులను తూనికలు, కొలతల శాఖ ఆధ్వర్యంలో తనిఖీ చేసినట్లు ఆ శాఖ ఇన్‌స్పెక్టర్ పీవీఎం పరమేశ్వర కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా గురువారం ఆయన మాట్లాడుతూ బియ్యం, పప్పు బస్తాలపై తయారీదారుడి చిరునామా కన్స్యూమర్ కేర్ నంబర్ లేని కారణంగా నాలుగు కేసులు నమోదు చేశామన్నారు. ప్యాకెట్లపై సరైన ముద్రలు, అడ్రస్సులు లేకపోవడంతో ఆ షాపుల యజమానులకు రూ.10 వేలు జరిమానా విధించామని చెప్పారు. దుకాణదారులు తూకాల్లో మోసాలకు పాల్పడినా, గడువు ముగిసిన వస్తువులు, ఆహార పదార్థాలను విక్రయించినా చట్టపైరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. తనిఖీలో కార్యాలయ సిబ్బంది ఉన్నారు.

సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి



మాట్లాడుతున్న సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు అంజిబాబు

కర్నూలు(రూరల్): హమాలీ కార్మికుల కోసం సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు అంజిబాబు, రాధాకృష్ణ డిమాండ్ చేశారు. గురువారం నగరంలోని కేకే భవనంలో హమాలీ కార్మికుల ఫెడరేషన్ జిల్లా కార్యవర్గ సమావేశం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు వెంకటేశ్వర్లు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. హమాలీలకు గుర్తింపు కార్డులు మంజూరు చేసి, పీఎఫ్, ఈఎస్ఐ, పని భద్రత సౌకర్యాలు కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్మికుల భద్రత కోసం చట్టం తీసుకొచ్చి, ఆరోగ్య సమస్యలు తలెత్తినపుడు ప్రభుత్వమే ఉచిత వైద్యం చేయించాలన్నారు. శిథిలావస్థకు చేరిన ప్రభుత్వ గిడ్డంగుల స్థానంలో కొత్తవి నిర్మించాలని కోరారు. అనంతరం జిల్లా హమాలీ కార్మికుల సంఘం కన్వీనర్‌గా ఎం.వెంకటేశ్వర్లు, జిల్లా గౌరవాధ్యక్షులుగా పీఎస్ రాధాకృష్ణతో పాటు మరో 25 మందితో కూడిన నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సీఐటీయూ నగర కార్యదర్శులు విజయ్, సాయిబాబా, నరసింహులు, అబ్దుల్ దేశాయ్, ఆఫీస్ బేరర్స్ తదితరులు పాల్గొన్నారు.

పత్తికొండలో నేడు జాబ్‌మేళా

పత్తికొండటౌన్: పత్తికొండ ప్రభుత్వ డిగ్రీకళాశాలలో ఈనెల 18వతేదీ శుక్రవారం స్థానిక నిరుద్యోగ యువత కోసం జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ మాధురి తెలిపారు. టాటా ఆల్‌సెక్, స్పందన స్ఫూర్తి ఫైనాన్షియల్ లిమిటెడ్ కంపెనీల ప్రతినిధులు ఈ జాబ్‌మేళాకు హాజరై నిరుద్యోగ యువతకు ఇంటర్వ్యూలు నిర్వహించి ఉద్యోగ అవకాశాలు కల్పిస్తారని తెలిపారు. ఆసక్తి గల నిరుద్యోగులు విద్యార్హతల సర్టిఫికెట్లతో నేరుగా జాబ్‌మేళాకు హాజరు కావాలని ప్రిన్సిపాల్ సూచించారు.